# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (PM-KISAN) పథకాన్ని 2030-31 వరకు పొడిగిస్తున్నామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

- ❖ ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- ❖ నీట్ పరీక్ష అంశంపై విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో పార్లమెంట్ ఉభయ సభలు నేటి సమావేశాలను సోమవారం వరకు వాయిదా వేశాయి.

- ❖ ఆంధ్రప్రదేశ్ లోని భోగాపురంలో 17 వేల 900 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

=====================

ఇంధన నిల్వ వ్యవస్థలతో కూడిన ఫ్లోటింగ్ సోలార్ ఫోటోవోల్టాయిక్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన (పీఎం-ఎస్ఎస్‌వై)కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఈ పథకానికి 5 వేల 070 కోట్ల రూపాయల మొత్తం వ్యయాన్ని మంత్రి మండలి ఆమోదించిందని తెలిపారు. ఈ పథకం ద్వారా 5 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఫ్లోటింగ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను, వాటితో పాటు కనీసం రెండు గంటల నిల్వ సామర్థ్యం కలిగిన ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం నిల్వ సామర్థ్యం 10 వేల మెగావాట్లుగా ఉంటుందన్నారు. ఈ పథకం అమలుకు అదనపు భూసేకరణ అవసరం ఉండదని, ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లు, కాలువలు, పారిశ్రామిక చెరువులను వినియోగించుకుంటే సరిపోతుందని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (PM-KISAN) పథకాన్ని 2030-31 వరకు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం అమలుకు ఐదేళ్ల కాలానికి 3.15 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక వ్యయాన్ని ఆమోదించినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. రైతుల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే దేశాభివృద్ధికి పునాదిగా ప్రభుత్వం భావిస్తోందని, అర్హులైన రైతు కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (DBT) విధానం ద్వారా పారదర్శకంగా, సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 23 విడతల ద్వారా 4 లక్షల 47 వేల కోట్ల రూపాయలకుపైగా నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలియజేశారు. ఈ ఆర్థిక సహాయం వల్ల రైతులు విత్తనాలు, ఎరువులు, సాగునీరు, యంత్రాలు ఇతర వ్యవసాయ అవసరాల కోసం సకాలంలో పెట్టుబడులు పెట్టగలుగుతున్నారని ఆయన వివరించారు. అదే విధంగా, "జాతీయ ఆఫ్‌షోర్ అన్వేషణ పథకం – సముద్ర మంథన్"కు కూడా కేంద్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు దీని అమలుకు 84 వేల 084 కోట్ల రూపాయల వ్యయాన్ని ఆమోదించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. సముద్ర జలాల్లో ఖనిజాలు, ఇంధన వనరుల అన్వేషణకు సంబంధించిన సమగ్ర చర్యలను ఈ పథకం కలిగి ఉందని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభలో కూడా ప్రతిపక్ష సభ్యులు నీట్ పరీక్ష అంశంపై విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై నినాదాలు చేసి సభాకార్యకలాపాలకు ఆటంకం కలిగించడంతో సభను సోమవారం వరకు వాయిదా వేశారు. సభ ప్రారంభంలో పలువురు కేంద్ర మంత్రులు సభా పీఠంపై నివేదికలు ఉంచారు. అందులో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌కు సంబంధించిన శాఖా పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికను కూడా సమర్పించారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్, తన శాఖకు సంబంధించిన నకిలీ వార్తల నియంత్రణ వ్యవస్థ సమీక్షపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సిఫార్సుల అమలు స్థితిగతులపై ఈరోజు సభలో ప్రకటన చేశారు. జీరో అవర్‌లో పలువురు సభ్యులు అత్యవసర ప్రజా సమస్యలను ప్రస్తావించినప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... ప్రతి అంశంపైనా సభకు అంతరాయం కలిగిస్తూ చర్చలకు దూరంగా ఉండడం ద్వారా ప్రతిపక్షం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. గందరగోళం కొనసాగడంతో రాజ్యసభ ఛైర్మన్ సి. పి. రాధాకృష్ణన్ సభను సోమవారం ఉదయం వరకు వాయిదా వేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ పరీక్ష అంశంపై విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో పార్లమెంట్ ఉభయ సభలు నేటి సమావేశాలను సోమవారం వరకు వాయిదా వేశాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాల సమయాన్ని నిర్వహించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. అయితే, నీట్ అంశంపై విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలిగించవద్దని స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ ఆందోళనలు కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమైన అనంతరం, రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు-2025, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2025, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు-2025లకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక సమర్పణ గడువును 2026 శీతాకాల సమావేశాల చివరి వారంలోని తొలి రోజు వరకు పొడిగించేందుకు సభ ఆమోదం తెలిపింది. అనంతరం, సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026ను పరిశీలన, ఆమోదం కోసం తీసుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్

బిల్లును ప్రవేశపెట్టగా, ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది. ఈ సందర్భంగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ… ఈ కీలక బిల్లుపై చర్చలో పాల్గొనకుండా ప్రతిపక్షం వ్యవహరించడం విచారకరమని అన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ ముందుగానే చర్చకు సమయం కేటాయించినప్పటికీ.. ప్రతిపక్షం సహకరించలేదని ఆయన విమర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విస్తరించిన ఖేలో ఇండియా పథకంతో పాటు జాతీయ క్రీడా సమాఖ్యలకు అందించే ఆర్థిక సహాయాన్ని పెంచేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2030-31 వరకు అమలుకానున్న ఈ కార్యక్రమాలకు కలిపి 36 వేల 441 కోట్ల రూపాయల వ్యయాన్ని మంజూరు చేసింది. ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో మీడియాకు వివరిస్తూ… దేశంలోని ప్రతి ప్రతిభావంతుడైన యువ క్రీడాకారుడికి అత్యున్నత స్థాయికి చేరుకునేందుకు స్పష్టమైన అవకాశాలు, మార్గదర్శక వ్యవస్థను ఈ పథకం కల్పిస్తుందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రారంభమై… టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (TOPS) స్థాయి వరకు చేరుకునేలా దేశవ్యాప్తంగా సమగ్ర శిక్షణా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి ఈ పథకం దోహదపడుతుందని అశ్వి.నీ వైష్ణవ్ తెలియజేస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా భోగాపురంలో 17 వేల 900 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విమానయానాన్ని బలోపేతం చేయడంతో పాటూ.. ప్రాంతీయ వృద్ధిని ప్రోత్సహించేలా 5 వేల 640 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి రేపు జాతికి అంకితం చేయనున్నారు. అదే విధంగా విశాఖ జిల్లా తర్లువాడలోని ఏఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు భోగాపురం నుండి వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నారు. కర్నూలు-IV పునరుత్పాదక ఇంధన జోన్ (ఆర్ఈజెడ్) - మొదటి దశ అనుసంధానానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. ఎన్ హెచ్-365 పై రేచెర్ల - గురువాయిగూడెం మధ్య నాలుగు వరుసల రహదారి, ఎన్ హెచ్-365 పై గురువాయిగూడెం - దేవరపల్లి విభాగం, ఎన్ హెచ్-67పై తాడిపత్రి బైపాస్ వంటి కీలక రహదారి ప్రాజెక్టులను కూడా జాతికి అంకితం చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =